క్లుప్తంగా

మంత్రికి మహాశివరాత్రి జాగరణ ఆహ్వానం



మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని మైత్రి మైదానంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి మహాజాగరణ సంబంధించి ఆహ్వాన పత్రికను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు, మెదక్ పార్లమెంట్ సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డిలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆహ్వాన పత్రిక అందజేశారు.

ప్రజాగోస, బీజేపీ భరోసా



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): ప్రజాగోస, బీజేపీ భరోసాలో భాగంగా గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు బండి శ్రీకాంత్‌గౌడ్ జిన్నారం మండలం కాజిపల్లిలో కార్నర్ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ గోదావరి, బీజేపీ నాయకుడు రవీందర్‌లు మాట్లాడుతూ బీజేపీని బలోపేతం చేయడమే తమ లక్ష్యం అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ బాలరాజు, యువ మోర్చా అధ్యక్షుడు భానుకిరణ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి వీరేశం, శక్తి కేంద్రం ఇన్‌చార్జి గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగుపై గ్రామ పంచాయతీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మురళి

జిన్నారం(పటాన్‌చెరు): అన్నారంలో ఏర్పాటు చేయనున్న కంటివెలుగుపై సర్పంచ్ మురళి ఆధ్వర్యంలో గురువారం గ్రామ పంచాయతీ సాధన సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి సభ్యులతో చర్చించారన్నారు. 21 నుంచి ప్రారంభమయ్యే కంటివెలుగుకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శేఖర్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్వామి వారి సన్నిధిలో సామూహిక కుంకుమార్చన



కుంకుమార్చనలో మహిళలు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదలలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ అర్చకుడు లక్ష్మీనరసింహాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి గురువారం ఆలయంలో కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు. భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు.

రోడ్ల అభివృద్ధికి కృషి



పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ పుష్ప నగేశ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో రోడ్లను అభివృద్ధి చేస్తామని కార్పొరేటర్ పుష్ప నగేశ్ తెలిపారు. గురువారం డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తున్నారని చెప్పారు. పనుల్లో నాణ్యత లోపించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూరుగడ్డ నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్ బీఆర్ఎస్ కౌన్సిలర్ల అలక

- సమావేశానికి గైర్హాజరైన వైస్‌చైర్మన్
- చైర్మన్, కమిషనర్ల ఏకపక్ష నిర్ణయాలపై అసంతృప్తి



మాట్లాడుతున్న కౌన్సిలర్ మున్నా

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పాలక వర్గంలో విభేదాలు ఉన్నాయనే గుసగుసలు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. చైర్మన్, వైస్‌చైర్మన్ల మధ్య కోల్డ్‌వార్ కొనసాగుతుంది. గతంలో వైస్‌చైర్మన్ వర్గం గైర్హాజరైనప్పుడు విపక్షాల మద్దతుతో కౌన్సిల్ సమావేశాలను నిర్వహించిన సంఘటనలూ ఉన్నాయి. గురువారం అమీన్‌పూర్ పాలక వర్గ సర్వసభ్య సమావేశానికి సొంత పార్టీ వైస్ చైర్మన్ నందారం నర్సింహాగౌడ్ గైర్హాజరయ్యారు. చైర్మన్, కమిషనర్లు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని అసంతృప్త కౌన్సిలర్లు వాపోయారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఓ కౌన్సిలర్ భర్త మాట్లాడుతూ తన కాలనీల్లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి రోడ్డు అభివృద్ధి పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరించినా, నేటికీ ఆ పనికి కావాల్సిన నిధులు కేటాయించలేదని, పని ప్రారంభానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశానికి వచ్చిన కౌన్సిలర్లు సమస్యలను ప్రస్తావించారు. రూ. రెండున్నర కోట్ల పనులకు సంబంధించి కౌన్సిల్‌లో ఆమోదం పొందింది. బీఆర్ఎస్ కౌన్సిలర్లు రాకపోయినా, బీజేపీ, కాంగ్రెస్ కౌన్సిలర్లు హాజరు కావడంతో సమావేశాన్ని నిర్వహించారు.

గైర్హాజరుకు కమిషనర్ వైఖరే కారణం నందారం

కౌన్సిల్ సమావేశానికి గైర్హాజరైన వైస్ చైర్మన్ నందారం నర్సింహాగౌడ్‌ను విలేకరి సంప్రదించగా కమిషనర్ సుజాత ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఆమె తీరుతో విసుగు చెంది సమావేశానికి హాజరు కాలేదన్నారు. ఈ కౌన్సిల్ సమావేశాల అజెండా తయారు చేసే సమయంలో తమ సూచనలకూ తగిన ప్రాధాన్యం లేదన్నారు. తెల్లారితే శివరాత్రి పండుగ వేళలో ఆదరాబాదరగా కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏంటని నర్సింహాగౌడ్ వివరించారు. అదే విషయాన్ని తాను కమిషనర్‌తోను ప్రస్తావించినా పట్టించుకోకుండా సమావేశాన్ని ఏర్పాటు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉర్సు విజయవంతం చేయాలి

అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): వెంకటఖాజా ఉర్సు ఉత్సవాలు విజయవంతం చేయాలని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. గురువారం దర్గాలో ఆయా శాఖల అధికారులు, ట్రస్టు సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. విద్యుత్ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు, పారిశుధ్య నిర్వహణకు గ్రామపంచాయతీ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. శాంతి భద్రతా పరిరక్షణకు పోలీస్ అధికారులు బందోబస్తు ఏర్పాటు చేస్తారన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకోసం ఆర్టీసీ అధికారులు నారాయణఖేడ్ సంగారెడ్డి డిపోకు ప్రత్యేక బస్సులను నడుపుతారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఉపాధ్యక్షుడు రాములు చిస్తీ, తహసీల్దారు రాధాబాయి, వరము చైర్మెన్ వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ స్ఫూర్తితో గిరిజనుల అభివృద్ధి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



డ్యాన్స్ చేస్తున్న చిన్నారులతో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: సేవాలాల్ మహరాజ్ స్ఫూర్తితో సీఎం కేసీఆర్ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను బుధవారం రాత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని జీహెచ్ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే మాట్లాడుతూ..తండాలను గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దిన మహోన్నత నాయకుడు సీఎం కేసీఆరేనని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్టీల ఆత్మగౌరవం పరిఢవిల్లేలా ఉద్యోగ, ఉపాధి, విద్య, క్రీడలు తదితర అన్ని రంగాల్లో కార్యక్రమాలు అమలుచేస్తూ వారి పురోగతికి బాటలు వేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు ఎంపీపీ సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీటీసీ సుప్రజా వెంకట్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నగేశ్, భారతి నగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, డీఆర్‌డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎంఈఓ పీపీ రాథోడ్, ఎంపీడీఓలు బన్సీలాల్, చంద్రశేఖర్, ఎంఈఓ రాథోడ్, వెంకటేష్ గౌడ్, చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు మట్టితో భూసారం పెరుగుదల



పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

హత్నూరా (సంగారెడ్డి): చెరువు మట్టితో భూసారం పెరుగుతుందని బాలవికాస స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి తిరుపతి తెలిపారు. గురువారం బడెంపేట రైతులకు బాలవికాస సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా జలవికాస పథకం ద్వారా పూడికతీత పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకంతో భూసారం దెబ్బతిని పంటలు దిగుబడి తగ్గుతుందన్నారు. చెరువులోని మట్టిని పంట పొలాలకు తరలిస్తే భూసారం పెరుగుతుందన్నారు. దీంతో పంటలో పోషక విలువలు పుష్టిగా లభిస్తాయన్నారు. రసాయన, క్రిమిసంహారక ఎరువుల వాడకం సైతం తగ్గించొచ్చని పేర్కొన్నారు. రైతులు ముందుకు వచ్చి చెరువు మట్టిని పంట పొలాలకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్వేత, రైతు సమన్వయ సమితి సభ్యుడు బుచ్చిరెడ్డి, ఉపసర్పంచ్ యాదగిరి, సమస్త ప్రతినిధి రవికుమార్, గ్రామస్తులు ప్రభు రెడ్డి, వెంకట్రాం రెడ్డి, సత్యనారాయణ, రాములు, సంగమేశ్వర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భవానీమాత ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న జెడ్పీటీసీ కొండల్ రెడ్డి, సర్పంచ్ శిరీష

కంది(సంగారెడ్డి): కంది మండలంలోని బ్యాతోల్ తండాలో దుర్గాభవానీమాత ఆలయ 13వవార్షికోత్సవం ఘనంగా జరిగింది. గురువారం తండాలో బోనాల ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి సమర్పించారు. ఈ మహోత్సవంలో జెడ్పీటీసీ కొండల్ రెడ్డి, సర్పంచ్ శిరీష కొండల్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ప్రకాష్ నాయక్, బీఆర్ఎస్ మండల నాయకులు హనుమంత్ నాయక్, రాజుగౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద రూ.1.10 లక్షలతో ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లను వారు ప్రారంభించారు. ఆలయ అభివృద్ధికి తమవంతు కృషిచేస్తామని వారు హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం



కాంగ్రెస్ చేపట్టిన పనుల గురించి వివరిస్తున్న నగేష్ షెట్కార్

నారాయణఖేడ్: కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జిల్లా ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్ తెలిపారు. ఖేడ్ మండలం గంగాపూర్‌లో గురువారం హాథ్‌సేహాథ్ జోడో యాత్ర నిర్వహించారు. గడపగడపకూ వెళ్లి కాంగ్రెస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పనుల గురించి వివరించారు. తిరిగి కాంగ్రెస్ అధికారంలోకొస్తే రూ.2లక్షల రైతురుణమాఫీ, రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇంటినిర్మాణానికి రూ.5లక్షల చొప్పున ఆర్థిక సాయం చేస్తామని వివరించారు. టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్, శంకరయ్యస్వామి, నాయకులు తాహెర్, సాయిలు, నెహ్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి ఆలయాలు ముస్తాబు



ఝరాసంగం(జహీరాబాద్): ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ



మునిపల్లి(అందోల్): శివలింగం

నేటి నుంచి సిద్ధేశ్వర ఆలయంలో ఉత్సవాలు

జహీరాబాద్ టౌన్: అల్గోల్ రోడ్డులోని శ్రీ సిద్ధేశ్వర ఆలయంలో శుక్రవాం నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహాశివరాత్రి పురస్కరించుకుని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. 17న ఉదయం శిఖర పూజ, ధ్వజారోహణం, మహాగణపతి పూజ, పుణ్యవచనాలు, అమ్మవారికి కుంకుమార్చన, గోమాత పూజ, శివ పూజ, అన్నదానం ఉంటుందన్నారు. 18న మహా శివరాత్రి సందర్భంగా ఉదయం 5 గంటలకు స్వామి వారికి రుద్రాభిషేకం, శనేశ్వర స్వామికి తైలాభిషేకం నిర్వహిస్తారన్నారు. మధ్యహ్నం 12.30 గంటలకు రుద్రహోమం, 2గంటలకు ఉమా భగవాన్ మ్యూజికల్ స్కూల్ భజన ఉంటాయని చెప్పారు. రాత్రి 12 గంటలకు లింగోద్భకాలంలో స్వామి వారికి మహాన్యాస పూర్వకరుద్రాభిషేకం నిర్వహిస్తారన్నారు. 19న ఉదయం 7 గంటలకు స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, 9.30 గంటలకు పల్లకి సేవ ఊరేగింపు, 11.10 గంటలకు పార్వతీపరమేశ్వర కల్యాణం, మధ్యహ్నం 12.10 గంటలకు అన్నదానం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వార్లను దర్శించుకోవాలని ఆయన కోరారు.

మునిపల్లి(అందోల్): మహాశివరాత్రి ఉత్సవాలకు మండలంలోని బుదేరా గుట్టపై వెలసిన శ్రీ భ్రమరాంభ మల్లికార్జునస్వామి, శివపార్వతుల దేవాలయం ముస్తాబయింది. గురువారం బుదేరా, అంతారంలోని చిన్న ఏడుపాయల దుర్గమ్మ అమ్మవారి దేవాలయం ఉత్సవాలకు సిద్ధమయింది. ఈ నెల 18నుంచి 21వరకు శివరాత్రి నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు సిద్ధమయ్యారు. బుదేరా గుట్టపై శ్రీ భ్రమరాంబ దేవాలయ అర్చకులు అయ్యప్పా స్వామి మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా స్వామి వారికి సుప్రభాత సేవ, అభిషేకం, హోమం, లింగోద్భవ సమయంలో మాహాపన్యాస పూర్వక రుద్రాభిషేకం ఉంటుందన్నారు. ఈ నెల 19న ఉదయం 10 గంటలకు స్వామి అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తారన్నారు. ఆలయ ధర్మకర్త రామమూర్తి దంపతులు అన్నదానం నిర్వహిస్తారన్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

ఝరాసంగం(జహీరాబాద్): మహాశివరాత్రి సందర్భంగా కేతకి ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జహీరాబాద్ ఆర్డీవో రమేష్ బాబు అన్నారు. గురువారం ఝరాసంగం కేతకి సంగమేశ్వర ఆలయ ఆవరణలో కొనసాగుతున్న పనులను ఆయన పర్యవేక్షించారు. ఆలయ ఆవరణలో విద్యుత్ దీపాల అలంకరణ, చలువ పందిళ్లు, అమృత గుండం, మరుగుదొడ్లు, పార్కింగ్ తదితర ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత, ఆలయ ఈఓ శశిధర్, మండల విద్యాధికారి శ్రీనివాస్, ఆలయ అధికారి శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



జోగిపేట(అందోల్): కన్‌సాన్‌పల్లి శివారులోని శ్రీ సిద్ధేశ్వర స్వామికీ గురువారం అభిషేకం మరియు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ మాణిక్ రెడ్డి దంపతులు ఈ పూజలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాదాగౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ డీబీ నాగభూషణం, బీఆర్ఎస్ నాయకులు చాపల వెంకటేశం, కుమ్మరి క్రిష్ణ, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

కులాలకు అతీతంగా పేదలకు అండగా నిలవాలి

అందోలు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



ప్రమాణ స్వీకారానికి హాజరైన ఎమ్మెల్యే క్రాంతికిరణ్

జోగిపేట(అందోల్): పేదలకు చేయూతనందించేందుకు ఆర్య వైశ్య సంఘం ముందుండాలని అందోలు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సూచించారు. గురువారం జోగిపేటలోని వాసవీ కల్యాణమండపంలో పట్టణ అధ్యక్షుడు రఘునాథ్ అధ్యక్షతన నిర్వహించారు. నూతన ఆర్య వైశ్య సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే ప్రసంగించారు. సేవా కార్యక్రమాల్లో వైశ్య సంఘం ముందుంటుందని, రాష్ట్ర స్థాయిలో జోగిపేట కార్యవర్గం ముందు వరుసలో ఉండాలని సూచించారు. ప్రభుత్వ పరంగా వైశ్య సంఘానికి అన్ని విధాలుగా సహకారమందిస్తామన్నారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాణిక్‌ప్రభు మాట్లాడుతూ ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటయ్యేలా సీఎం కేసీఆర్‌ను ఒప్పించాలని కోరారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

జోగిపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా బస్వ సత్యప్రకాశ్, ఉపాధ్యక్షుడిగా రంగ హరిప్రసాద్, చికోటీ శంకర్, ప్రధాన కార్యదర్శిగా కన్నయ్య గారి వరప్రసాద్, మధిరె మురళిధర్, కోశాధికారిగా గజవాడ రాజు, జాయింట్ సెక్రెటరిగా కోట నరేష్, బీపేట సంపత్ కుమార్‌లచే రాష్ట్ర వైశ్య సంఘం నాయకుడు జూకంటి లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు మాణిక్ ప్రభులు ప్రమాణ స్వీకారం చేయించారు.

ఎమ్మెల్యేకు సన్మానం

అందోలు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్యలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడిని జోగిపేట మున్సిపల్ కౌన్సిలర్ చిట్టిబాబు, రంగ సురేష్, పీఆర్‌టీయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎ.మాణయ్య, పీఆర్‌టీయు మండల శాఖ అధ్యక్షుడు నరోత్తం, మహిళా ఆర్యవైశ్య సంఘం కార్యవర్గంతో పాటు పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మల్లిఖార్జున్, మాజీ సంఘం అధ్యక్షుడు పెంద్యాల రాములు, రాష్ట్ర మెడికల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు యెదిరె రమేశ్, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు సి.దయాకర్ రావు పాల్గొన్నారు.

కాలేజీలో ఆధునిక సదుపాయాలు



కేక్ కట్ చేస్తున్న సొసైటీ చైర్మన్, కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నర్సాపూర్: శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో కొనసాగుతున్న వైపర్ కాలేజీలో ఆధునిక సదుపాయాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ చైర్మన్ విష్ణురాజు సూచించారు. నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ నుంచి కాలేజీకి ఏ ప్లస్ గ్రేడ్ రావడంతో గురువారం ఏర్పాటు చేసిన అభినందన సమావేశానికి ఆయన హాజరై, మాట్లాడుతూ... కాలేజీకి ఏ ప్లస్ గ్రేడ్ రావడంపై ప్రిన్సిపాల్, అధ్యాపక బృందాన్ని అభినందించారు. తెలంగాణలోని విద్యా సంస్థల్లో ఏ ప్లస్ గ్రేడ్ సాధించిన మొదటి కాలేజీగా వైపర్ నిలుస్తుందని చెప్పారు. ఫార్మసీ రంగంలో కొత్త ఆలోచనలకు రూపం ఇవ్వడానికి కాలేజీ యాజమాన్యం అండగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా కాలేజీలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

25 మందికి కోవిడ్ టెస్టులు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయిం. గురువారం 25మందికి కోవిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు వైద్యసిబ్బంది మనోహర్ తెలిపారు.

త్రిమూర్తి శివజయంతి బ్రోచర్ ఆవిష్కరణ

జహీరాబాద్: పట్టణంలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో త్రిమూర్తి శివ జయంతి మహోత్సవాలకు సంబంధించి బ్రోచర్‌ను గురువారం ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ ఎస్.పెంటారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రామకృష్ణారెడ్డి, మొహియొద్దీన్, కేతకీ ఆలయ కమిటీ చైర్మన్ నీల వెంకటేశం, వ్యాపార వేత్త అల్లాడి వీరేశం పాల్గొన్నారు.

చింత ప్రభాకర్ ఆరోగ్యం బాగుండాలని పూజలు



పూజలు నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు

సంగారెడ్డి టౌన్: రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని గురువారం ఎఫ్ఆర్ఎస్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు చక్రపాణి ఆధ్వర్యంలో 101 కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన చింత ప్రభాకర్ ఆయురారోగ్యాలతో ఉండాలని రేణుక ఎల్లమ్మ తల్లిని వేడుకున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ జెడ్పీటీసీ మనోహర్ గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రేపు ఖేడ్‌కు మంత్రి హరీశ్‌రావు రాక

నారాయణఖేడ్: రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఈ నెల 18న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు నారాయణఖేడ్ రానున్నారని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తెలిపారు.

◆ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఇబ్రితాబాద్ శివారులోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అదేవిధంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోదూరి రాములు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్: చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌డీపీ, సీడీపీ పథకం కింద క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌లో 15 పోస్టులు ఖాళీగా ఉన్నాయని జిల్లా అధికారి విజయ ఒక ప్రకటనలో తెలిపారు. నెలకు రూ.24వేల జీతం ఐఐహెచ్‌టీ నుంచి చేనేత టెక్నాలజీ డిప్లమాలో ఉత్తీర్ణత సాధించి రెండేళ్ల అనుభబవం ఉండాలన్నారు. ఈ నెల 25వరకు దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

◆ ఉత్తమ విద్యకు చిరునామగా నిలుస్తున్నాం

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులకు క్వాలిటీ ఎడ్యుకేషన్, ఇంటిగ్రేట్ సిస్టంతో ది మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థలు ఉత్తమ విద్యకు చిరునామగా నిలుస్తున్నాయని చైర్మన్ రాజు సంఘాని పేర్కొన్నారు. గురువారం ఇంద్రేశం గ్రామంలోని ఆర్కేనగర్‌లో మాస్టర్ మైండ్స్ స్కూల్ నూతన బ్రాంచ్‌ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరక్టర్ నాగరాజు, సంస్థ ప్రతినిధి రామకృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు దీప పాల్గొన్నారు.

◆ ఘనంగా రేణుక ఎల్లమ్మ కల్యాణం

వట్‌పల్లి(అందోల్): కేరూర్ గ్రామంలో రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం మూడు రోజులుగా జరుగుతున్నాయి. గురువారం ఒగ్గు కళాకారులు అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని పెద్దపట్ల శోభారాణి, కిష్టాగౌడ్ ఘనంగా నిర్వహించారు.

◆ శివరాత్రి వేడుకలు ప్రారంభించిన ఎమ్మెల్యే

పటాన్‌చెరు: మహాశివరాత్రి పురస్కరించుకొని ప్రజాపిత ఈశ్వరియా బ్రహ్మ కుమారీస్ ఆధ్వర్యంలో పట్టణంలోని రహదారి బంగ్లా ఆవరణంలో ఏర్పాటు చేసిన మహా శివరాత్రి వేడుకలను గురువారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. దేశంలోని జ్యోతిర్లింగాలను ఒకే చోట ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అనంతరం ఫొటో ప్రదర్శనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.


◆ పాదయాత్రలో శివస్వాములు

మునిపల్లి(అందోల్): మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన శివస్వాములు ఇరుముడితో శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లారు. గురువారం మండలంలోని తాటిపల్లితో పాటు ఆయా గ్రామాల శివస్వాములు శివనామ స్మరణ చేస్తూ గ్రామంలోని హనుమాన్ దేవాలయం నుంచి శ్రీశైలం బయలు దేరారు.

◆ ఎఫ్‌టిఎల్‌ను ఆక్రమిస్తే కఠిన చర్యలు

పటాన్‌చెరు టౌన్: చెరువులకు సంబంధించిన ఎఫ్‌టిఎల్‌ను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పటాన్‌చెరు తహసీల్దార్ పరమేశం అన్నారు. పట్టణంలోని సాకి చెరువుకు సంబంధించిన ఎఫ్‌టిఎల్ పరిధిలో ఓ షెడ్ వేశారని ఇరిగేషన్ శాఖ ద్వార సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ పరమేశం, సీఐ వేణు గోపాల్ రెడ్డి, పోలీసు సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి వెళ్లి షెడ్ వేసిన వారితో మాట్లాడారు. సర్వే నెంబర్ 641 పట్టభూమి అయినప్పటికీ షెడ్ వేసిన చోటు ఎఫ్‌టిఎల్ పరిధిలోకొస్తుందని, షెడ్ వేసిన వారిని తహసీల్దార్ పరమేశం నచ్చ చెప్పి అక్కడి నుంచి మరో చోటుకు మార్పించారన్నారు.

◆ ఫ్లెక్సీలు చింపిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న ఎన్‌ఎంఆర్ యువసేన

పటాన్‌చెరు టౌన్: మహాశివరాత్రి పురస్కరించుకొని ముందస్తుగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు వెంకటేష్ పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహాశివరాత్రి సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ చిట్కుల్ గ్రామంలో నిర్వహించనున్న శివోత్సవానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు పోచారం వేబ్రిడ్జి, ముత్తంగి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు చింపేశారన్నారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీసులను వారు కోరారు. ఈ కార్యక్రమంలో చావ్వ రమేష్, సతీష్, సీహెచ్ అనిల్, రాజు, కృష్ణ, నాగేంద్ర, ముత్తు, భీమా, అనిల్, మనోహర్ పాల్గొన్నారు.